సాక్షి
ఖమ్మం
గురువారం । 20 । జూలై । 2023



ఉద్యాన పంటలకు 'ఉపాధి'..
ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు ఇస్తూ ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 10లో



బీసీలకు దక్కని న్యాయమైన వాటా
బీసీలకు ఏ రంగంలో కూడా న్యాయమైన వాటా దక్కడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 24°

వాతావరణం
గురువారం జిల్లా అంతటా ఆకాశం మేఘావృత్తమై ఉంటుంది. చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష



బాధ్యతలు స్వీకరిస్తున్న అభిలాష

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా అభిలాష అభినవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా ఉన్న స్నేహలత జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా ఇటీవల బదిలీ కాగా, మహబూబాబాద్ అదనపు కలెక్టర్ అభిలాషను ఖమ్మం బదిలీ చేసిన విషయం విదితమే. ఈమేరకు ఖమ్మం వచ్చిన ఆమె తొలుత కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా, అభిలాష స్వస్థలం బీహార్ రాష్ట్రంలోని పాట్నా కాగా, 2017 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన ఆమె జాతీయ స్థాయిలో 18వ ర్యాంక్ సాధించారు. ఆమెను జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

గిరిజన సంక్షేమశాఖ డీడీగా విజయలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన సంక్షేమశాఖలో పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో డీడీ(ప్లానింగ్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.విజయలక్ష్మిని ఖమ్మం డీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ డీడీగా ఉన్న పి.కృష్ణానాయక్‌ను గురుకులాల డిప్యూటీ కార్యదర్శిగా హైదరాబాద్ బదిలీ చేశారు.

గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను నియమిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. అన్ని పోస్టులు కలిపి 42మందిని నియమించనుండగా, ఈనెల 24వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తు వెంట ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీల మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, కుల, స్థానిక ధ్రువీకరణ పత్రాలతో పాటు 4నుంచి 10వ స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జతపర్చాలని తెలిపారు. కాగా, జనరల్ విభాగంలో జువాలజీ ఎనిమిది, గణితం ఐదు, కామర్స్, బోటనీ, ఇంగ్లిష్ నాలుగేసి పోస్టులతోపాటు హిందీ, పొలిటికల్ సైన్స్ మూడేసి పోస్టులు, కెమిస్ట్రీ రెండు పోస్టులు, హిస్టరీ, ఫిజిక్స్, తెలుగు ఒక్కో పోస్టు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అలాగే, వృత్తి విద్యా కోర్సుల్లో ఈటీ, జీఎఫ్‌సీ, ఎల్‌ఎం అండ్ డీటీ, ఏపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), ఓఏ, కంప్యూటర్ సైన్స్ ఒక్కో పోస్టు భర్తీ చేయనున్నట్లు డీఐఈఓ వెల్లడించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు కలిగి ఉంటే అర్హులని, నెట్, స్లెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో కాకతీయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి జరగాల్సిన పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు బుధవారం కేయూ క్యాంపస్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, వివరాల కోసం కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఎంపికైన ప్రథమ సంవత్సరం విద్యార్థుల సర్టిఫికెట్లను ఈనెల 21వ తేదీ నుంచి పరిశీలించనున్నారు. మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు పదో తరగతి మెమో, 1నుంచి ఇంటర్ వరకు స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, సీటు ధృవీకరణ పత్రం, ఇంటర్ టీసీ, కులధృవీకరణ పత్రం, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధృవీకరణ పత్రంతో పాటు నాలుగు ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా సూచించారు. అలాగే, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకుని తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

సంక్షేమంపై గౌతమ్ మార్క్!



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పేదల దరికి చేర్చడంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక శైలితో ముందుకు సాగారు. పారదర్శకంగా పాలన అందిస్తూ.. పేదల సమస్యలకు పరిష్కారం చూపడంలో సఫలమయ్యారు. అలాగే, అభివృద్ధి పనులకు ఎక్కడా ఆటంకం కలగకుండా అధికారులు పర్యవేక్షించేలా చూస్తూ తన మార్క్ కనబరిచారు. ప్రధానంగా దళితబంధు పథకం అమలులో ఆయన చూపించిన చొరవతో సకాలంలో యూనిట్లు అందాయి. దీంతోపాటు ధరణి సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల నిర్మాణం, మన ఊరు – మన బడి తదితర పథకాల అమలులో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపారు. కాగా, కలెక్టర్‌గా గౌతమ్ బాధ్యతలు స్వీకరించి గురువారంతో రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా కథనం.

- ప్రభుత్వ పథకాలు పేదలకు చేరువ
- దళితబంధు యూనిట్ల ఎంపిక, నిర్వహణపై దృష్టి
- ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక నజర్
- పలు పథకాల్లో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానం
- నేటితో రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

దళితబంధుపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలుచేశారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలుస్తూ వారు ఎంచుకోవాల్సిన యూనిట్లపై కూడా సలహాలు, సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చింతకాని మండలం కలెక్టర్ ప్రత్యేక చొరవతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ మండలంలోనే 3,500 మందికి యూనిట్లు అందడం విశేషం.

ధరణి సమస్యలపై..

ధరణి వెబ్‌సైట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. నిషేధిత భూముల జాబితాలో పడటంతో రైతులు తమ భూములను అమ్ముకోలేక.. ఇతరులకు బదలాయించలేక ఇబ్బంది ఎదుర్కొన్నారు. దీంతో కలెక్టర్ గౌతమ్ చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించారు. కొందరు దరఖాస్తు చేసుకోకున్నా సుమోటోగా తీసుకుని దాదాపు 82 వేల సర్వే నంబర్లకు సంబంధించి లక్ష ఎకరాల వరకు పీవోబీ క్లియరెన్స్ ఇవ్వడం విశేషం. తద్వారా పెనుబల్లి, చింతకాని, వేంసూరు మండలాల్లో కొన్ని ఏళ్లుగా నానుతున్న సమస్యకు పరిష్కారం లభించింది.

మన ఊరు–మన బడికి అగ్రస్థానం

మన ఊరు–మన బడి అమలులో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 426 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేయగా.. 200 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు చివరి దశకు చేరాయి. ఈ విషయమై అధికారులతో తరచుగా సమీక్షిస్తూనే పాఠశాలలను స్వయంగా తనిఖీ చేసి అవసరమైన పనులను గుర్తించారు. అలాగే, తొలిమెట్టు కార్యక్రమం విజయవంతానికి చొరవ తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు తోడ్పడ్డారు.

అక్రమ లే ఔట్లపై ఉక్కుపాదం

జిల్లాలో అనుమతి లేకుండా ఏర్పాటైన లే ఔట్లపై కలెక్టర్ ఉక్కుపాదం మోపారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఆయన అన్ని పత్రాలను పరిశీలించడం.. సరైన అనుమతులు లేకుంటే తొలగింపునకు ఆదేశించారు. అలాగే, వెంచర్ల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన 200 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ఫెన్సింగ్ వేయించడమే కాక హరితహారం, క్రీడా ప్రాంగణాలపైనా దృష్టి సారించారు.

59 జీఓపై అవగాహన

ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరుచుకున్న వారు జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే, ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉండడంతో కలెక్టర్ నేరుగా పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కొంత మేర నగదు చెల్లిస్తే క్రమబద్ధీకరణ జరుగుతుందని, తద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి.

పారదర్శక పాలన

కలెక్టర్ గౌతమ్ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే క్రమంలో కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే ప్రజావాణిలో వచ్చే సమస్యలపై అప్పటికప్పుడు మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే, తరచుగా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తూ ప్రతిచోట ఒక పీహెచ్‌సీ, ఒక పాఠశాలను తనిఖీ చేయడం ఆనవాయితీగా మార్చుకోవడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

గళం విప్పనున్న ఎంపీలు

- నేటి నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు
- రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు, ఇతర అంశాలపై చర్చకు రెడీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అటు తెలంగాణకు.. ఇటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై పార్లమెంట్ సాక్షిగా కేంద్రాన్ని నిలదీసేందుకు ఎంపీలు సిద్ధమవుతున్నారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు గురువారం ప్రారంభం కానుండగా బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి సమస్యలను లేవనెత్తేందుకు సమాయత్తమయ్యారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం, రైల్వే ప్రాజెక్టుల మంజూరుపై కేంద్రాన్ని ప్రశ్నిస్తామంటూ ఎంపీలు వెల్లడించారు.

హామీలు అమలు కాక

కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి, ఉమ్మడి జిల్లాకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అభిప్రాయంతో ఎంపీలు ఉన్నారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి పాపటపల్లి–మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలనే డిమాండ్ రైతుల నుంచివస్తోంది. అలాగే, ఖమ్మం మీదుగా వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, భద్రాచలం రోడ్–కొవ్వూరు రైల్వేలైన్ హామీల అమలు, కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుపై నిలదీయనున్నట్లు ఎంపీలు తెలిపారు. .

ఈసారి గట్టిగా..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తెలంగాణకు, ఉమ్మడి ఖమ్మంకు జరుగుతున్న అన్యాయంపై గట్టిగా నిలదీస్తామని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు కర్మాగారం హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. ఈమేరకు తమ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతలతో కలిసి కేంద్రాన్ని ఎండగడతామని తెలిపారు. అలాగే, పాపటపల్లి–మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాలని, ఖమ్మం మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేయనున్నట్లుతెలిపారు.

అదనపు కలెక్టర్‌గా మధుసూదన్‌నాయక్

- ప్రస్తుత అదనపు కలెక్టర్ హైదరాబాద్‌కు బదిలీ
- డీఆర్వో శిరీషకు కూడా స్థానచలనం



మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా డి.మధుసూదన్‌నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న నూతి మధుసూదన్‌ను హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మంచిర్యాలలో పనిచేస్తున్న మధుసూదన్‌నాయక్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, బదిలీపై వెళ్తున్న మధుసూదన్ 2020 ఫిబ్రవరి 10న ఇక్కడ విధుల్లో చేరగా సుమారు మూడున్నరేళ్లపాటు తన పరిధిలోని కార్యకలాపాల నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

డీఆర్వో బదిలీ

జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) డి.శిరీష భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఆర్డీఓగా బదిలీ అయ్యారు. అయితే, ఈ స్థానంలో ఎవరినీ కేటాయించలేదు. ఇక ఖమ్మం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ), ఐపీటీ రైల్వేలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్.దశరథ్‌ను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓగా బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ ఇటీవల బదిలీ కావటంతో కొత్తగూడెం ఆర్డీఓ కె.స్వర్ణలతను నియమించారు.

న్యూ పెన్షన్ కాదు... నో పెన్షన్

- ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందే..
- జిల్లాకు చేరిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర



ధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్నది న్యూ పెన్షన్ కాదని, ఇది నో పెన్షన్ పథకమని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఎస్ సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. పాత పింఛన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టిన రథయాత్ర బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న నూతన పింఛన్ విధానం ఉద్యోగుల పాలిట శాపంలా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 3.3 లక్షల మంది ఉద్యోగుల్లో రెండు లక్షల మంది కొత్త పింఛన్ విధానంలోనే ఉండగా, వీరందరూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసిన నేపథ్యాన తెలంగాణ ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, జోగులాంబ గద్వాల జిల్లా నుండి ప్రారంభమైన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర 31 జిల్లాల్లో పర్యటించాక ఆగస్టు 12న హైదరాబాద్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, సభకు అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట విక్రమ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పోతురెడ్డిపల్లి రామగోపి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు సరితతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మోత్కూరి మధు, నాగిరెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, బిక్కు, కోడి లింగయ్య, విజయ్, భాను, నరసింహారావు, యాకూబ్, నెల్లూరి రవి, రాజారత్నం, లోకేష్, రాంకుమార్, మల్లీశ్వరి, భావన తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముసురు

జిల్లావ్యాప్తంగా వర్షం
- జలాశయాల్లోకి వరదనీటి ప్రవాహం
- ఊపందుకుంటున్న వరి నాట్లు



సత్తుపల్లి రూరల్ : సత్తుపల్లి మండలంలో జోరు వర్షంలోనూ వరినాట్లు చేస్తున్న కూలీలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో రెండో రోజు కూడా ముసురు కొనసాగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం రాత్రి మొదలైన వాన బుధవారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురవగా, కొన్నిచోట్ల సాధారణ వర్షం కురిసింది. బుధవారం రాత్రి 8 గంటలకు వాతావరణ శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం జిల్లాలోని రఘునాథపాలెం మండలం పంగిడిలో అత్యధికంగా 34.0 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో జిల్లాలోని పలు జలాశయాల్లోకి స్వల్పంగా నీరు చేరుతోంది. కాగా, బుధవారం పలుచోట్ల భారీ వర్షం నమోదవుతుందని వాతావరణ శాఖ వెల్లడించినా ఎక్కడా ఆ స్థాయిలో వర్షం కురవలేదు. అయితే, మరో ఐదురోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తామని అధికారులు వెల్లడించారు. వర్షాలు జోరందుకుని జలాశయాల్లోకి నీరు చేరితే వరి, మిర్చి పంటల సాగు విస్తారంగా పెరిగే అవకాశముంది.

పంగిడిలో అత్యధికం..

బుధవారం రాత్రి 8 గంటల వరకు జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం పంగిడిలో అత్యధికంగా 34.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, కామేపల్లి మండలం లింగాలలో 32.3, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 31.8, సింగరేణి మండలం గేటు కారేపల్లిలో 30, ఏన్కూరులో 27.8, వైరాలో 25.3, సత్తుపల్లి మండలం గంగారంలో 25, తల్లాడ, రఘునాథపాలెంలో 24.5, కొణిజర్ల పెద్దగోపతిలో, రఘునాథపాలెం మంచుకొండలో 24, పెనుబల్లిలో 23.3, సత్తుపల్లిలో 21.5, వేంసూరులో 17.5, కల్లూరు, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 16.3, ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురంలో 15.8 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అప్రమత్తంగా ఉండండి..
– టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పువ్వాడ సమీక్ష



సాక్షిప్రతినిధి, ఖమ్మం: భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యాన అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల వద్ద పర్యవేక్షించాలని సూచించారు. ఖమ్మంలోని మున్నేరు, భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహంపై మంత్రి ఆరా తీశారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు పడవలు, లైఫ్ జాకెట్లు సమకూర్చుకోవాలని మంత్రి పువ్వాడ సూచించారు.

నేడు డీ వార్మింగ్ డే

- పిల్లలందరితో మాత్ర మింగించాలి..
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ గురువారం డీ వార్మింగ్ డే సందర్భంగా నులి పురుగుల నివారణ మాత్ర మింగించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపించి రక్తహీనతతో బాధపడతారని తెలిపారు. ఈమేరకు జిల్లాలో 19 ఏళ్ల లోపు ఉన్న 3,11,317 మంది పిల్లలతో మాత్ర మింగించి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. భోజనం తర్వాత ఒకటి నుండి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుండి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి ఇవ్వాలని, ఆపై వయస్సు వారితో ఒక మాత్ర మింగించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ మాలతి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీసీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎస్సీ డీడీ సత్యనారాయణ, అధికారులు కృష్ణ నాయక్, రవిబాబు, జ్యోతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

జిల్లాలో యూనిట్ల స్థాపనకు టీఎస్–ఐ పాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన టీఎస్–ఐపాస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడగా జిల్లాలో 61 యూనిట్ల స్థాపనకు వచ్చిన వంద దరఖాస్తుల్లో 88 దరఖాస్తులను అనుమతించారు. పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీఓ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్‌లో వాహనాల పార్కింగ్ కోసం సోలార్ ప్యానళ్లతో నిర్మిస్తున్న షెడ్ల పనులను కలెక్టర్ పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

ఆగుతూ.. సాగుతూ!



జిల్లా కేంద్రంలో బుధవారం రోజంతా ఓ మోస్తరువర్షం కురుస్తూనే ఉంది. ఉదయం పది గంటల తర్వాత ఓసారి వర్షం తగ్గడంతో వాహనదారులంతా ఒకేసారి రహదారిపైకి వచ్చారు. దీంతో ఇలా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నగరంలోని పాత ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి జెడ్పీ సెంటర్ వరకు వాహనాలు బారులు తీరగా ఆగుతూ.. సాగుతూ అన్నట్లుగా ముందుకు కదిలాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పువ్వాడ


కేటీఆర్‌తో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావును మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయన వెంట మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా కొనసాగిన ఆకుల మూర్తి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మూర్తి వెల్లడించారు.

హోంగార్డ్ ఆఫీసర్లకు ఆర్థికసాయం


చెక్ అందజేస్తున్న సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: హోంగార్డులకు మంజూరైన ఆర్థిక సాయాన్ని బుధవారం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రూ.5వేల చొప్పున మెడికల్ బిల్లులు, ఓ హోంగార్డు కుమార్తె వివాహానికి రూ.10వేలు మంజూరయ్యాయి. చెక్‌లు అందుకున్న వారిలో హోంగార్డు ఆఫీసర్లు వై.జాన్, బి.శ్రీను, ఎం.నాగేశ్వరరావు, డి.అనూదీప్ ఉండగా, ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సాంబశివరావు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంఓగా రాంబాబు


రాంబాబుకు ఉత్తర్వులు అందజేస్తున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంఓగా రాంబాబు నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటిండెంట్ బి.వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా రాంబాబును అధికారులు, వైద్యులు అభినందించారు.

కందుకూరుకు జూనియర్ కళాశాల మంజూరు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వేంసూరు మండలం కందుకూరులో జూనియర్ కళాశాలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి స్వగ్రామమైన కందుకూరులో ఆయన సొంత నిధులతో కళాశాలకు భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈమేరకు ఎంపీ వినతితో బండి సోమకాంతం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుమతిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకటి కరుణ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, త్వరలో కళాశాలకు గ్రూపులు వెల్లడించడంతో పాటు అధ్యాపకులు, సిబ్బందిని నియమిస్తామని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మంకు చెందిన పి.శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం స్పెషల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శాంతిలత బుధవారం తీర్పు చెప్పారు. నగరానికి చెందిన యారకల శంకర్ వద్ద శ్రీనివాసరావు 2015 జనవరి 5న రూ.8 లక్షలు అప్పు తీసుకున్నాడు. తిరిగి 2015 డిసెంబర్ 28న రూ.9.50 లక్షలకు చెక్కు జారీ చేయగా ఆ చెక్కును ఖాతాలో జమ చేస్తే సరిపడా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో శంకర్ తన న్యాయవాది కె.కమలాకర్‌రావు ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈ మేరకు న్యాయమూర్తి కేసును విచారించాక శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదుదారుడికి రూ.9.50లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

రెండు పాఠశాలలు మూసివేత

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం మన ఊరు – మన బడి ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నా తల్లిదండ్రులకు అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. ఈమేరకు నేలకొండపల్లి మండలంలోని బీల్యాతండా, షుగర్ ఫ్యాక్టరీలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులెవరూ చేరకపోవడంతో మూసివేయాలని నిర్ణయించారు. కాగా, బీల్యాతండా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను బైరవునిపల్లి పాఠశాలకు, షుగర్ ఫ్యాక్టరీ పాఠశాల ఉపాధ్యాయుడు రవికిషోర్‌ను రాజేశ్వరపురం పాఠశాలలో సర్దుబాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.రాములు తెలిపారు.

రోజంతా వీడని వాన!

జిల్లావ్యాప్తంగా ముసురు


వైరా : రిజర్వాయర్‌లోకి చేరిన వరద నీరు

వైరా: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం బుధవారం కూడా కొనసాగింది. దీంతో వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఈమేరకు నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. రోజుకో అంగుళం చొప్పున పెరుగుతుండగా పూర్తి స్థాయి నీటిమట్టం 18.3 అడుగులకుగాను ప్రస్తుతం 14.9 అడుగులకు చేరింది. ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వరి నారు పోసిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు.


- **తల్లాడ:** తల్లాడలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పత్తి పైర్లకు ఊపిరి పోసినట్లయింది. అలాగే, మండలంలోని మిట్టపల్లి వద్ద గంగదేవిపాడు వాగు, బిల్లుపాడు–రామచంద్రాపురం మధ్య ఉన్న వాగు, గొల్లగూడెం వాగు ఉధృతంగా ప్రవహించాయి.
- **సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి మండలంలో కురుస్తున్న వర్షంతో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. మండలంలోని బేతుపల్లి చెరువులో 16 అడుగులకు గాను 15 అడుగులుగా నీటిమట్టం నమోదైంది. అలాగే, వరద నీటితో కాల్వలు పారుతున్నాయి. ఇంతకాలం వాన కోసం ఎదురుచూసిన రైతులు జోరువర్షంలోనే వరి నాట్లు వేయడం కనిపించింది.
- **కారేపల్లి:** కారేపల్లిలో రోజంతా ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో వాగుల్లో వరద ప్రవహించగా, చెరువుల్లోకి ఓ మోస్తరుగా నీరు చేరింది. ఇదిలా ఉండగా వానతో కారేపల్లి కేజీబీవీ ముందు ఉన్న మద్దులవాగు మోరీపై గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.


తల్లాడ : తల్లాడ వద్ద పత్తి పైరులో నిలిచిన వర్షపు నీరు


తల్లాడ : మిట్టపల్లి వద్ద గంగదేవిపాడు వాగులో ప్రవహిస్తున్న వరద


కారేపల్లి : వరద నీటిలో చేపలు పడుతున్న యువకులు


సత్తుపల్లి రూరల్ : కాల్వలో వరద నీరు


సత్తుపల్లి రూరల్ : బేతుపల్లి చెరువులో 15 అడుగులకు చేరిన నీరు

స్నేహలత సేవలు మరువలేనివి

వీడ్కోలు సన్మానంలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లా సమగ్రాభివృద్ధికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా స్నేహలత అత్యుత్తమ సేవలు అందించారని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కొనియాడారు. అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా వెళ్తున్న స్నేహలతను కలెక్టరేట్‌లో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె, పట్టణ ప్రగతి, దళితబంధు, మన ఊరు–మన బడి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు నిలిపేలా స్నేహలత కృషి చేశారని తెలిపారు. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించడం ద్వారా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచారని చెప్పారు. అనంతరం స్నేహలత మాట్లాడుతూ స్వేచ్ఛగా విధులు నిర్వర్తించేలా అధికారులు సహకరించారని తెలిపారు. అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎస్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


స్నేహలతను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

అర్చకుల వేతనాల పెంపు ఘనత కేసీఆర్‌దే..

ఖమ్మంగాంధీచౌక్: అర్చకుల వేతనాలను పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ధూప దీప నివేదన అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ అన్నారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని గాయత్రిభవన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ధూప దీప నివేదన అర్చకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రూ.2,500 గౌరవ వేతనంతో పనిచేస్తున్న ధూప దీప నివేదన అర్చకుల వేతనాన్ని కేసీఆర్ రూ.10 వేలకు పెంచారని తెలిపారు. అర్చకుల జీవన స్థితిగతులు మెరుగుపర్చేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి అంతా కృతజ్ఞులుగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవజ్ఝల ప్రసాద్‌శర్మ మాట్లాడుతూ సంఘానికి అర్చకులంతా సమానమేనని, ఎవరికి అన్యాయం జరిగినా పోరాడుతామని తెలిపారు. ధూప దీప నివేదన అర్చక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మునగలేటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి మరిగంటి భార్గవాచార్యులు, భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజనికుమార్ శర్మ, పురాణం కిరణ్‌శర్మతో పాటు ఆమంచి సురేష్‌శర్మ, పి.అచ్యుతరామారావు, కె.భానుప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

బీసీలకు దక్కని న్యాయమైన వాటా

ఖమ్మం మామిళ్లగూడెం: జనాభా 56శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సరైన వాటా దక్కడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బెంగళూరులో జరిగినటువంటి విపక్ష పార్టీల సమావేశంలో దేశంలో కులగణన చేపట్టాలని తీర్మానించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ నేతలు కూడా కులగణనపై తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే, బీసీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 21న ఢిల్లీలో జరిగే ఆందోళనకు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, నాయకులు లింగబోయిన పుల్లారావు, హన్మంతు, నాగేశ్వరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జేపీఎస్‌ల పనితీరుపై ఆరా

- క్రమబద్ధీకరణకు అడుగులు
- జిల్లాలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న 298 మంది

నేలకొండపల్లి: సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపట్టగా.. వారి డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి 16 రోజుల పాటు వివిధ రూపాల్లో సమ్మె చేయగా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యాన జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు విధివిధానాలను ఖరారు చేసింది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన జేపీఎస్‌లను వారి పనితీరు ఆధారంగా రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు సమాచారం. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, హరిత హారం అమలు, సెలవులు, గైర్హాజరు తదితర అంశాల ఆధారంగా జేపీఎస్‌ల పనితీరును మదింపు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసి మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంపీఓల నుంచి వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా జేపీఎస్‌లపై ఏమైనా పోలీసు కేసులు ఉన్నాయా అని కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 460 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండగా వీరిలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 298 మంది పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కల్లూరు: ఓ మహిళకు తరచుగా ఫోన్ చేసి వేధిస్తున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదైంది. కల్లూరుకు చెందిన మహిళను ఇదే పట్టణానికి చెందిన నరసింహారావు ఫోన్‌లో గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకృతివనంలో చెట్లు నేలమట్టం!

కొణిజర్ల: మండలంలోని చిన్నమునగాలలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం చెట్లను గ్రామస్తులు రెండు రోజుల క్రితం పూర్తిగా నరికేశారు. ఈ విషయంపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చిన్నమునగాలలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో స్థానిక హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలోని ఖాళీ స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అందులో కోనో కార్పస్, తదితర మొక్కలు నాటగా ఏపుగా పెరిగాయి. అయితే, ఈ మొక్కల కారణంగా బాలబాలికలకు చర్మ సంబంధమైన వ్యాధులు వస్తున్నాయంటూ కాలనీవాసులు చెట్లను నేలమట్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి వెళ్లి విచారించగా పిల్లల ఆరోగ్యం పాడవుతున్నందునే మొక్కలు నరికేశామని తల్లిదండ్రులు తెలిపారు. ఈమేరకు స్థానిక సర్పంచ్ స్వప్న, కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్/సత్తుపల్లి టౌన్/నేలకొండపల్లి: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల స్థానాలను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేయనున్నారు. ఈమేరకు ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ ఐదు, ఇంగ్లిష్ నాలుగు, బీబీఏ, బీసీఏ, కెమిస్ట్రీ రెండు పోస్టులతో పాటు స్టాటిస్టిక్స్ పోస్టు ఒకటి ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, డెయిరీ సైన్స్, హిస్టరీ సబ్జెక్టు అధ్యాపకుల పోస్టులు, నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాళ్లు పానెం రామచంద్రరావు, డాక్టర్ ఆలేటి పరంజ్యోతి వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఎస్సీ, ఎస్టీలైతే పీజీలో 50 శాతం, ఇతరులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, స్లెట్, పీహెచ్‌డీతోపాటు బోధనానుభవం ఉన్న వారికి ప్రాధ్యానత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అన్ని సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుని నిర్దేశిత తేదీల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు


నేలకొండపల్లి: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన టి.వంశీకృష్ణ బైక్‌పై నేలకొండపల్లి వస్తున్నాడు. అదే సమయాన కోదాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వంశీకృష్ణ ఢీకొని కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పైనంపల్లికి చెందిన కృష్ణారెడ్డి బైక్‌పై రోడ్డు దాటుతుండుగా కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

తల్లాడ మండలంలో..


ఘటనాస్థలంలో ట్యాంకర్

తల్లాడ: తల్లాడ మండలం నరసింహారావుపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తగూడెం వైపు నుంచి కొండపల్లి వెళ్తున్న ట్యాంకర్ కోల్డ్ స్టోరేజ్ వద్ద వెనుక నుంచి టిప్పర్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ సీ.హెచ్.రామారావుకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోవడంతో స్థానికులు కలిసి పోలీసులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అలాగే, ట్యాంకర్‌ను వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వాహనంపై ఉన్న ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన దుగ్గిరాల నాగరాజు గాయపడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కొణిజర్ల: మండలంలోని తుమ్మలపల్లి రెవెన్యూ పరిధిలో నల్ల గ్రానైట్ క్వారీ తవ్వకాలకు సంబంధించి బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తుమ్మలపల్లిలోని బీరమయ్య, కామరాతి అమ్మవార్ల గుడి వెనక 186 సర్వే నంబర్‌లోని భూమిలో నల్ల గ్రానైట్ తవ్వకానికి అనుమతి కోసం ఓ సంస్థ దరఖాస్తు చేసుకుంది. దీంతో స్థానిక కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన సభలో అదనపు కలెక్టర్ మధుసూదన్ పాల్గొని రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఏడు హెక్టార్లలో క్వారీ ఏర్పాటు చేయనుండగా, పలువురు రైతులు చుట్టుపక్కల పొలాలకు నష్టం జరుగుతుందని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ రవీందర్, ఏఈ వెంకటేష్, తహసీల్దార్ దొడ్డారపు సైదులు, ఎస్‌ఐ జె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలోని కోటి దాబా వద్ద ఆటోను లారీ ఢీకొట్టిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఖమ్మం నుండి ఖమ్మం రూరల్ మండలం నుండి చింతపల్లికి వెళ్తున్న ఆటో దాబా వద్దకు రాగానే వరంగల్ వైపు నుండి అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నాగరాజుకు తీవ్రగాయాలు కాగా, ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పోలీస్‌స్టేషన్ ఎదురుగానే గంజాయి విక్రయం!

ఖమ్మంక్రైం: ఎక్కడో గంజాయి అమ్మితే థ్రిల్ ఏముంటుందని అనుకున్నాడో ఏమో కానీ సదరు వ్యక్తి ఏకంగా పోలీసుస్టేషన్ ఎదురుగా అడ్డా పెట్టేశాడు! ఈ తతంగం చాన్నాళ్లుగా జరుగుతున్నట్లు తెలుస్తున్నా పక్కా సమాచారం అందడంతో పోలీసులు తనిఖీ చేసి గంజాయి సహా హుక్కా పీల్చేందుకు ఉపయోగించే సామగ్రిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ పాన్‌షాపులో ఖిల్లాబజార్‌కు చెందిన ఖయ్యూం గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ విషయమై సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించగా రెండు కేజీల గంజాయి, తొమ్మిది మోజో పేపర్లు, హుక్కా పైపులు తదితర సామగ్రి లభ్యమయ్యాయి. ఈమేరకు షాపు యజమాని ఖయ్యూంను బుధవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

బాలల చిరునామా కోసం ప్రయత్నాలు

ఖమ్మంగాంధీచౌక్: పశ్చిమ బెంగాల్ నుంచి రైలులో బాలలను తరలిస్తుండగా అధికారులు మంగళవారం చేరదీసి ఆశ్రయం కల్పించిన విషయం విదితమే. ఈమేరకు బాలల చిరునామా తెలుపుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆరుగురు బాలలకు ఖమ్మంలోని అమ్మ హోంలో చేర్చారు. వీరిని హైదరాబాద్‌లో నిర్మాణ పనులకు తీసుకువెళ్తున్నట్లు చెప్పిన ఐదుగురిని ఖమ్మం జీఆర్పీ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు బుధవారం బాలలతో అధికారులు మాట్లాడి వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డులు సేకరించడంలో నిమగ్నమయ్యారు. పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపాక పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేరుస్తామని వెల్లడించారు. కాగా, వీరిని తరలిస్తున్న వ్యక్తులపై విచారణ కొనసాగుతోంది.

నూతన పట్టాదారులకూ రైతు బీమాలో అవకాశం

ఖమ్మంవ్యవసాయం: నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు కూడా రైతుబీమా పథకంలో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలాగే, గతంలో పాస్ పుస్తకాలు ఉండి, పేర్లు నమోదు చేయించుకోని రైతులు పోర్టల్‌లో పేర్ల నమోదుకు ఆగస్టు 5వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారితో పాటు గతంలో అర్హత ఉండి పేర్లు నమోదు చేయించుకోని రైతులు 36,584 మంది రైతులు బీమా పథకానికి అర్హులు కాగా, మంగళవారం నాటికి 9,073 మంది మాత్రమే పేర్లు నమోదు చేయించుకున్నారు. మిగిలిన వారు అన్ని పత్రాలతో ఏఈఓలను సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయ నిర్మల ఓ ప్రకటనలో సూచించారు.

కల్లూరు ఎంపీఓ సరెండర్

ఖమ్మం సహకారనగర్: కల్లూరు మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) పి.వీరస్వామిని పంచాయతీరాజ్ గ్రామీణ శాఖ సెక్రటరీకి సరెండర్ చేశారు. ఈమేరకు కలెక్టర్ గౌతమ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా పంచాయతీ కార్యదర్శిగా వీరస్వామి విధులు నిర్వర్తించిన సమయాన అవినీతి ఆరోపణలు రావడమే కాక ఇతర ప్రాంతాల్లో ఆరోపణలు ఉండడంతో ఖమ్మం ఆర్డీఓతో విచారణ చేయించారు. ఈమేరకు నివేదిక ఆధారంగా ఆయనపై కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అలాగే, రికార్డుల నిర్వహణలో సైతం లోపాలు బయటపడినట్లు తెలిసింది. కాగా, వీరస్వామిపై గతంలోనూ పలుమార్లు అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

24 నుంచి 'గురుకుల' హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువులకు అర్హత పరీక్షల సమయం ఆసన్నమైంది. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించేందుకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తొలి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 24 నుంచి టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు కన్వీనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు..

పరీక్షల టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు చేసి, సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఇదివరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా... తాజాగా వెల్లడించిన తేదీల ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 8.30గంటల నుంచి 10.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30గంటల నుంచి 6.30గంటల వరకు మూడో సెషన్ జరుగుతుంది.

'నో క్యాస్ట్.. నో రిలీజియన్ కాలమ్ చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో 'నో క్యాస్ట్', 'నో రిలీజియన్' అనే కాలమ్‌ను తప్పుకుండా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులాన్ని, మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించింది. తమ కుమారుడికి నో క్యాస్ట్.. నో రిలీజియన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 2019లో సండెపు స్వరూప పలుమార్లు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో స్వరూపతో పాటు మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ కన్నెగంటి లలిత ఉత్తర్వులు జారీ చేశారు. 'పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించడం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 14,19,21,25ను ఉల్లంఘించడమే అవు తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద మత స్వేచ్ఛతో పాటు ఇలాంటి కొన్ని హక్కులు పౌరులకు ఉన్నాయి. ఏ మతాన్ని, కులాన్ని ఆచరించకూడదని ఎంచుకునే హక్కు పౌరులకు ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ఇదే చెబుతోంది. నో క్యాస్ట్.. నో రిలీజియన్ అనే కాలాన్ని అన్ని దరఖాస్తుల్లో (ఆన్‌లైన్‌లోనూ) చేర్చాలని మున్సిపల్ కమిషనర్లకు, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాం' అని తీర్పులో పేర్కొన్నారు.



మళ్లీ లేఆఫ్స్

డౌన్ ట్రెండ్‌లో ఐటీ సెక్టార్

2022తో పోల్చితే 2023 తొలి 6 నెలల్లో అధికం

లేఆఫ్స్.ఎఫ్‌వైఐ సర్వే నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లేఆఫ్స్ పెరుగుదలతో టెకీలకు మళ్లీ కష్టాలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా టెకీల ఉద్వాసన పర్వం ఉధృతమవుతోంది. అమెరికా, ఐరోపాతో పాటు పలు దేశాల్లో ద్రవ్యోల్బణ పెంపుతో ఐటీ, ఇతర కంపెనీల లాభాలు తగ్గిపోయాయి. ఆర్థికరంగ ఒడిదొడుకుల కారణంగా స్టార్టప్‌లలో పెట్టుబడుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పట్టిందని నిపుణులు చెబుతున్నారు.

➤ ఆరునెలల్లోనే 2,13,020 మంది టెకీలకు ఉద్వాసన

2023లో (జనవరి నుంచి జూన్) ప్రపంచవ్యాప్తంగా 2,13,020 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 45,166 టెకీలు ఉద్యోగాలు కోల్పోగా, ఈ ఆరునెలల్లో ఉద్యోగుల లేఆఫ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉద్యోగులను తొలగించిన జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాహూ, మెటా, జూమ్ ఉన్నాయి.

➤ భారత్‌లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితులు ఉన్నాయి. మన దగ్గర ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా 10,774 మంది టెకీలను తొలగించినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక వెల్లడించింది. 2022లో ఉద్వాసనకు గురైన టెకీ ఉద్యోగుల సంఖ్య 6,530. ఈ ఏడాదితో పోల్చి చూసినప్పుడు తొలి ఆరునెలల్లో టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్నవారే అధికంగా ఉద్యోగాలు కోల్పోయారు.


➤ కోవిడ్ విజృంభించిన 2020లోనూ భారత్‌లోని 12,932 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. 2021లో కొత్త స్టార్టప్‌లకు ఫండింగ్ పెరిగింది. దీంతో ఈ సంఖ్య 4,080కు తగ్గింది.

బెంగళూరు టాప్

టెకీల తొలగింపులో భారత్‌లో బెంగళూరు మొదటి వరుసలో ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే అక్కడ 6,967 మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్టార్టప్ హబ్‌గా రూపొందుతున్న క్రమంలో ఈ ప్రభావం అధికంగా పడినట్టు నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో లేఆఫ్‌లు పెద్దగా లేకపోవడంతో లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదికలో టెకీ ఉద్యోగుల తొలగింపునకు సంబంధించిన గణాంక వివరాలు పొందుపరచలేదు.


బెంగళూరు	ముంబై	గురుగ్రామ్
6,967	1,410	1,105
న్యూఢిల్లీ 487	చెన్నై 400	

లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక ప్రకారం భారత్‌లో గత రెండేళ్లలో (6 నెలల్లో) లే ఆఫ్‌ల తీరిది..



వివిధ రంగాల వారీగా చూస్తే...

లేఆఫ్స్.ఎఫ్‌వైఐ గణాంకాల ప్రకారం 2023 తొలి ఆరునెలల్లో భారత్‌లో వివిధ రంగాల్లో 10,774 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారని తన నివేదికలో పొందుపరిచింది.



ఇప్పుడు స్టార్టప్‌లదీ వ్యథే...

గత శీతాకాలం నుంచి ఇప్పటిదాకా 107 ఇండియన్ స్టార్టప్‌లలో 28,046 మంది ఉద్యోగులకు లే ఆఫ్ సెగ తాకినట్టు ఐఎన్‌సీ 42 తాజా నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో 22 భారత ఎడ్‌టెక్ స్టార్టప్‌లు 9,871 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయని, 59 స్టార్టప్‌లు 9,271 మంది ఉద్యోగులను తొలగించినట్టు పేర్కొన్నారు.




ఆ ఏడాది చివరి దాకా తప్పదు

ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ప్రపంచవ్యాప్తంగా ఐటీ సెక్టార్ డౌన్‌ట్రెండ్‌లోనే ఉందని చెప్పాలి. టెకీల లేఆఫ్ చేసే పరిస్థితులు ఈ ఏడాది చివరిదాకా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ ఎకానమీ ఎఫెక్ట్ కారణంగా ఆర్థికరంగ పరిస్థితి బాగా లేకపోవడంతో అమెరికాతో సహా ఇతరదేశాలు ప్రభావితమవుతున్నాయి. ఐటీ ఎనబుల్డ్ సర్వీసెస్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉండగా, భారత్‌లోనే కొంత ప్రభావం తక్కువగా కనిపిస్తోంది. పాత టెక్నాలజీపై పనిచేస్తూ, పనితీరు బాగాలేని వారికి ఉద్వాసన పలికేందుకు దీనిని కంపెనీలు ఒక అవకాశంగా తీసుకున్నాయి. ఈ పరిస్థితుల ప్రభావం స్టార్టప్‌లపై తీవ్రంగా పడింది.

– రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత





మణికొండ: ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాసరచయిత, సినిమాగా వచ్చిన మిథునం కథా రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ (71) బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ఫ్లోటిల్లా గెటెడ్ కమ్యూనిటీలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జానకి, ఇద్దరు కుమారులు చైత్ర, వంశీకృష్ణ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. 1952 సెప్టెంబర్ 21న ఏపీలోని గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం అగ్రహారంలో అనసూయ, సుబ్బారావు దంపతులకు జన్మించిన శ్రీరమణ అసలుపేరు కామరాజ రామారావు. కానీ ఆయన రచయిత శ్రీరమణగానే అందరికీసుపరిచితం.

ఏపీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన రాసిన కథలు మానవత్వం, విలువలతో కూడి ఉంటాయని జగన్ గుర్తుచేసుకున్నారు.

చమత్కార చక్రవర్తి

సాక్షి, హైదరాబాద్: సాహితీ ప్రపంచానికి సుపరిచితులైన శ్రీరమణ తెలుగులో పేరడీ రచయితగా సుప్రసిద్ధులు. అనేక మంది ప్రసిద్ధ రచయితల శైలిని అనుకరిస్తూ వందలకొద్దీ పేరడీలు రాసి స్వయంగా ఆయా రచయితల అభినందనలనూ పొందారు. అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీచానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించారు. ఆయన మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లలో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆ తర్వాత బంగారు మురుగు పేరిట కథ రాశారు. మిథునం కథల సంపుటి ప్రచురించారు. ఆయన సినీ రంగంలో నూ పనిచేశారు. ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికల కు సంపాదకులుగా, పత్రిక అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2014కిగాను కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.

స్కూలు రోజుల్లోనే వ్యాసరచనలు...

ఆయన ప్రాథమిక విద్యను శ్రీరామ హిందూ ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. ఫస్ట్‌ఫారమ్‌లో అంటే హైస్కూలులో అడుగుపెట్టాలంటే నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులై వేమురులోని కవిరాజా జిల్లా పరిషత్ హైస్కూలులో చేరారు. ఆ పాఠశాలలో ఎస్ఎస్ఎల్సీ దాకా చదివారు. స్కూలు రోజుల్లో రామకృష్ణ మిషన్ ఆశ్రమం స్వామి వివేకానందునిపై వ్యాసరచన పోటీ నిర్వహించగా శ్రీరమణ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. అలా వరుసగా ఆరేళ్లపాటు ప్రథముడిగా నిలిచారు. పన్నెండేళ్ల వయసులో విజయవాడ ఆకాశవాణి నుంచి యువజనుల కార్యక్రమంలో ఆయన ఇంటర్వ్యూ వచ్చింది.

బాల్య స్మృతులతో మిథునం...

శ్రీరమణ తన మనసులో బాల్యం నుంచి నాటుకున్న ఆలోచనలకు అక్షరరూపంగా మిథునం కథా సంపుటిని రచించారు. ఇది ఎన్నో సంప్రదాయ కుటుంబాల కథ అని ఆయన చెప్పేవారు. దీన్ని చదివి ముచ్చటపడిన దర్శకుడు బాపు స్వదస్తూరిలో ఆ కథను రాసి శ్రీరమణకు పంపారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ సైకియాట్రిస్ట్, తెలుగు భాషాభిమాని, సాహితీప్రియుడైన డాక్టర్ వి. జంపాల చౌదరి ఆ దస్తూరితోనే మిథునం కథను ప్రచురించి ఇప్పటికి 4 లక్షల మందికి అందచేశారు.

శ్రీరమణగా పేరు మార్పు..

తాతకు మగ పిల్లలు లేకపోవడంతో పీయూసీ చదివే రోజుల్లో శ్రీరమణను ఆయన దత్తత తీసుకున్నారు. శ్రీరమణ జన్మనామం వంకమామిడి రాధాకృష్ణ కాగా, దత్తత వెళ్లాక కామరాజు రామారావుగా మార్చుకున్నారు. అయితే ఈ పేర్ల తికమక నుంచి బయటపడేందుకు తన పేరును శ్రీరమణగా మార్చుకున్నారు.

ఆ 187 మందిని విధుల్లోకి తీసుకోండి : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 2018లో తొలగించిన 108 అంబులెన్స్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వీరి తొలగింపు సహజ న్యాయ సూత్రాలను, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. 8 వారాల్లోగా వారిని విధుల్లోకి తీసుకోవాలని తేల్చిచెప్పింది. ప్రభుత్వం, జీవీకే సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ పని గంటలను 12 నుంచి 8 గంటలకు తగ్గించాలని 108 అంబులెన్స్ సిబ్బంది 2018, ఆగస్టులో ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం 947 మంది సిబ్బందిని తొలగించింది. చట్టవిరుద్ధంగా తమను తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2018లోనే ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. తొలగింపు చట్టవిరుద్ధమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా 187 మందిని మాత్రం విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు.

జిల్లా వార్తలు

ఐటీడీఏ డీడీగా మణెమ్మ



మణెమ్మ

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా పి.మణెమ్మ నియమితులయ్యారు. ఈమేరకు శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆసిఫాబాద్ ఐటీడీఏ డీడీగా పనిచేస్తున్న ఆమెను భద్రాచలం బదిలీ చేశారు. కాగా, ప్రస్తుతం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే మణెమ్మ భద్రాచలం రావడానికి ఆసక్తిగా లేకపోగా, ఇతర ప్రాంతానికి బదిలీ కోసం యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

'నవోదయ'లో 11వ తరగతి ప్రవేశానికి 22న పరీక్ష

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 22న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి 398 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, నవోదయ విద్యాలయలో ఉదయం 10.45 నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పరీక్షప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10.30 గంటలకల్లా చేరుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కార్మికులపై నిర్లక్ష్యాన్ని విడనాడాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామపంచాయతీ కార్మికుల పోరాటం క్షుద్ర రాజకీయం కాదని.. బతుకుదెరువు, ఉద్యోగ భద్రత కోసం చేస్తున్న పోరాటమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, 14 రోజులుగా 50 వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం ప్రభుత్వ తీరుకు నిదర్శనమని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కానీ, 11వ వేతన సంఘం సిఫారసు మేరకు కానీ రూ.19 వేల కనీస వేతనం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకపోగా రూ.500 నుంచి రూ.1,000 పెంచి అదే గొప్పగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా అమలు చేయడంతో పాటు పని భారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యాన పంటలకు 'ఉపాధి' రాయితీ

- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులంతా అర్హులే
- నీటి వసతి కలిగి ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారికి అవకాశం
- మూడేళ్ల పాటు నిర్వహణ వ్యయం, రాయితీపై డ్రిప్ పరికరాలు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి



సత్తుపల్లి మండలంలో సాగు చేస్తున్న మామిడితోట

ఖమ్మంవ్యవసాయం: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్ద పీట వేసింది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యాన పంటలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఉపాధి హామీ పథకంలో పనిచేసే చిన్న, సన్నకారు రైతులకు మేలు జరిగేలా ఈ నిర్ణయాన్ని వెలువరించింది. జాబ్ కార్డు కలిగి ఉండి ఐదెకరాల్లో భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకంలో అవకాశం కల్పిస్తారు. నీటి వనరులు ఉన్న రైతులు వరిసాగు చేస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. దీంతో వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, ఉద్యాన పంటలను ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.

ఖమ్మం జిల్లాలో 3,158 ఎకరాలు

ఖమ్మం జిల్లాలో 3,158 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక రూపొందించారు. నేలల రకాలు, వనరులను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పిస్తారు. ఈమేరకు మామిడి 1,300 ఎకరాల్లో, కొబ్బరి వెయి ఎకరాల్లో, జామ 250, నిమ్మ, బత్తాయి 200 ఎకరాల చొప్పున, మునగ వంద ఎకరాల్లో, జీడి మామిడి 50, సీతాఫలం 24, సపోట, డ్రాగన్‌ఫ్రూట్, దానిమ్మ పదేసి ఎకరాలతో పాటు అల్ల నేరెడు నాలుగు ఎకరాల్లో సాగు చేయించాలనేది అధికారుల లక్ష్యం. కాగా, కూలీల ఖర్చు, మెటీరియల్, డ్రిప్ పరికరాలపై రాయితీని అన్ని పంటలకు ఎకరం చొప్పున పరిగణనలోకి తీసుకోనుండగా, డ్రాగన్ ఫ్రూట్‌కు మాత్రం అర ఎకరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

మూడేళ్ల పాటు సంరక్షణ బాధ్యతలు

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతలను మూడేళ్ల పాటు ప్రభుత్వమే చూస్తుంది. మొక్కలు, ఎరువుల కొనుగోలు, నిర్వహణ, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి వంటి పనుల అయ్యే ఖర్చు మూడేళ్ల పాటు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుంది. మామిడి ఒక్కో మొక్కకు రూ.30, బత్తాయి మొక్కకు రూ.44 ఇలా అన్ని మొక్కలను చెల్లించడమే కాక ఎరువు కోసం ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చునెలకు రూ.10 చొప్పున చెల్లిస్తారు. కాగా, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులన్నీ ఉపాధి హామీ కూలీలతో చేయించాల్సి ఉంటుంది. ఇవేకాక బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై అందజేస్తారు. ఐదెకరాల లోపు భూమి కలిగి ఉండి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులను బిందు సేద్యం పథకంలో రాయితీకి అర్హులుగా నిర్ణయించారు. సాగునీటి వసతి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాల పంపిణీ చేయనున్నారు.

వివిధ పంటలకు అందిస్తున్న రాయితీలు

(ఎకరాకు రూ.ల్లో / డ్రాగన్ ఫ్రూట్ మాత్రం అర ఎకరాకు)

పంట	కూలీల ఖర్చు	మెటీరియల్	డ్రిప్	మొత్తం
డ్రాగన్‌ఫ్రూట్	1,06,272	1,44,000	29,859	2,80,131
దానిమ్మ	84,039	37,460	24,904	1,46,403
మునగ	74,392	20,500	35,646	1,30,538
సీతాఫలం	70,048	30,938	25,204	1,26,190
యాపిల్‌బేర్	50,848	26,938	25,204	1,02,990
బత్తాయి	43,882	19,236	31,013	94,131
జామ	48,243	21,820	22,418	92,841
నిమ్మ	48,243	21,160	22,418	91,821
మామిడి	40,791	13,815	28,971	83,577
జీడి మామిడి	40,791	13,395	28,971	83,157
సపోట	35,002	12,262	20,262	67,526
అల్లనేరేడు	23,426	7,694	16,666	47,786

రైతులు వినియోగించుకోవాలి



ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఉద్యానపంటల సాగును సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పత్రాలతో ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తర్ణాధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఈ పథకంపై జిల్లా వ్యాప్తంగా రైతుల్లో అవగాహన కల్పించనున్నాం.

– జి.అనసూయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, ఖమ్మం

ఖమ్మం బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఈడీ



ఖమ్మం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్ బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో తనిఖీ చేశారు. పలువురు ప్రయాణికులతో మాట్లాడిన ఆయన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల మేనేజర్లతో సమావేశమయ్యారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేలా అందరూ కృషి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఆర్ఎం భవానీప్రసాద్, డిపో మేనేజర్లు శ్రీనివాస్, స్వామి, దేవదానం, రామారావు, డి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి, ఖమ్మం సీఐలు విజయశ్రీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత ఎఫ్‌సీఐతోనే సాధ్యం

ఖమ్మం డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్



ఎఫ్‌సీఐ గోదాంల్లో బియ్యం నిల్వలను వివరిస్తున్న మేనేజర్ రంగప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: దేశ ఆహార భద్రతలో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) కీలక పాత్ర పోషిస్తోందని సంస్థ ఖమ్మం డివిజనల్ మేనేజర్ బి.రంగప్రసాద్ నాయక్ వెల్లడించారు. ఖమ్మం కాల్వొడ్డులోని ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎఫ్‌సీఐ కీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఖమ్మం డివిజన్ పరిధిలో 88 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల్లో బియ్యం నిల్వ చేస్తుండగా, గతంలో అందించిన బియ్యం కాకుండా మరింతగా పోషక విలువలు ఉన్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ సహకారంతో సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కాగా, 2022–23 సంవత్సరంలో ఖమ్మం డివిజన్‌లో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించి, మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశం నలుమూలలకు రైలు మార్గంలో సరఫరా చేస్తున్నామన్నారు. ప్రధానంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఖమ్మం డివిజన్ నుంచి బియ్యం వెళ్తున్నాయని తెలిపారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాముల్లో బియ్యం నిల్వ విధానాన్ని మేనేజర్ రంగప్రసాద్ ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎంగా వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్ ఆర్టీసీలోని పలువురు అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు ఆర్టీసీ సికింద్రాబాద్ ప్రాంతీయ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్. వెంకన్నను ఖమ్మం రీజినల్ మేనేజర్‌గా నియమించారు. ఇక్కడి ఆర్ఎం ప్రభులత సెలవులో వెళ్లడంతో డిప్యూటీ సీటీఎం భవానీప్రసాద్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, నూతన ఆర్ఎంగా నియమితులైన వెంకన్న రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రూ.39కోట్లతో నిర్మించనున్న 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అశ్వారావుపేటను సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అశ్వారావుపేటలో రూ.150 కోట్లతో మరో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించి నిధులు కూడా విడుదల చేసిందని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే 2,000 నుంచి 2,500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మేనేజర్లు బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది రేక్‌లకు తగ్గకుండా బొగ్గు రవాణా



బొగ్గు రవాణాను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఈపీసీ సీహెచ్‌పీని బుధవారం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, ఏరియా ఇంజనీర్ రఘురామరెడ్డి సందర్శించారు. కోల్ స్టాక్ బంకర్లను పరిశీలించిన వారు రోజుకు ఎనిమిది రేక్‌లకు తగ్గకుండా బొగ్గు రవాణా చేయాలని సూచించారు. అలాగే, సీహెచ్‌పీ బంకర్ చుట్టు పక్కల డస్ట్, బొగ్గు పేరుకుపోకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అధికారులు కోటిరెడ్డి, సోమశేఖర్, రమణారెడ్డి, రాకేష్, ముక్క మోహన్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.